05032025-MAI-04_Layout 1 3/5/2025 3:32 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

### నమస్తే తెలంగాణ

# నీటి నిర్వాకం

**స్వరాష్ట్రం** సిద్ధించడానికి ముందున్న పరిస్థితులు మళ్లీ దాపురించాయి. నిరుడు వానలు బాగా కురిసినా జలాశయాల్లో మాత్రం నీళ్లు లేవు. గొంతెండిన పొలాలు కోతకు బదులు మేకల మేతకు ఆవాసాలుగా మారుతున్నాయి. యాసంగికి ఇబ్బంది లేదు, సాగుకు సరిపడా నీళ్లున్నాయన్నది సర్కారు మాట. మరి పొలాలు ఎందుకు ఎండుతున్నాయంటే సమాధానం లేదు. పంటలు చేతికి అందకపోవడంతో రైతు ఆత్మహత్యలు మళ్లీ పెరిగాయి. నిరుడు కురిసిన వానలతో అక్టోబర్ చివరిదాకా వరద ప్రవాహాలు వస్తూనే ఉన్నాయి. కానీ, వేసవికి ముందే అన్ని జలాశయాలు అడుగంటాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కళకళలాడేలా చేసిన కాళేశ్వరం ఎత్తిపోతల వ్యవస్థను నేటి కాంగ్రెస్ సర్కారు కక్షతో, కావాలనే పడావు పెట్టింది. అందుకే తెలంగాణ సాగునీటికి నేడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్కారు చేతకానితనం కేవలం గోదావరి జలాలకే పరిమితం కాలేదు. అటు కృష్ణా జలాలను పొరుగు రాష్ట్రం అడ్డూ అదుపు లేకుండా ఎగరేసుకుపోతుంటే గుడ్లప్పగించి చూస్తున్న అసమర్థ ప్రభుత్వం మనది.

నిరుడు రాష్ట్రంలోని 358 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. 316 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ముందటేడాది 72 టీఎంసీలు సముద్రంలో కలవగా, ఈ సారి 844 టీఎంసీల జలాలు సముద్రంలో కలిశాయంటే వరదలు ఎంత వచ్చాయో అర్థం చేసుకోవచ్చు. 2024, అక్టోబర్ 25 నాటికి శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ మట్టానికి చేరుకోగా, 215 టీఎంసీల నీటితో కళకళలాడింది. కానీ, ప్రస్తుతం 74.81 టీఎంసీలకు చేరుకొని అడుగంటింది. యాసంగి మొదట్లోనే శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నీటి నిల్వలు ఖాళీ అయ్యాయి. నీటి నిర్వహణలో సర్కారు దారుణ వైఫల్యానికి ఎండిన పొలాలే మూగసాక్షులు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ సోయి ఉన్నట్టు కనిపించడం లేదు. కాళేశ్వరం జలాలు రాకపోవడంతో భూగర్భ నీటిమట్టాలు అట్టడుగుకు చేరుకుంటున్నాయి.

వాస్తవ పరిస్థితి కండ్ల ముందు కనబడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో ఇంకా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుండటం దురదృష్టకరం. కాళేశ్వరం జలాలతో చెక్‌డ్యాములు, చెరువులను క్రమం తప్పకుండా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నింపడం వల్ల భూగర్భ జలాలు ఉబికి వచ్చేవి. దాంతోపాటు 24 గంటల ఉచిత విద్యుత్తుతో బోర్ల ద్వారా రైతులు సేద్యం చేసుకునేవారు. చివరి పొలం వరకు నీరందించాలన్న తపన కేసీఆర్‌లో కనిపించేది. పెద్ద, చిన్న ప్రాజెక్టుల్లో కలిపి తాగునీటి అవసరాలకు పోను డిసెంబర్ నాటికి 354 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక నిర్వహణ కమిటీ లెక్కతేల్చింది. అయితే, ఈ అంచనాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయని ఇంజినీర్లు మొదటినుంచి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ వస్తున్నారు. వీటి గురించిన సరైన అవగాహన లేని ప్రభుత్వం తూతూ మంత్రంగా ప్రణాళికలు రూపొందించి చేతులు దులుపుకొన్నది. పర్యవసానంగా రాష్ట్రంలో ఎటుచూసినా ఎండిన పంటలు, బీడువారిన పొలాలే కనిపిస్తున్నాయి.

# బీజేపీతో పొంచి ఉన్న ప్రమాదం



**రమేశ్ హజారి**
93909 19090

**పదేండ్ల అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచింది తెలంగాణ. ప్రగతి పథంలో ముందు వరుసలో నిలిచింది. అయితే, జాతీయ రాజకీయాల చలనశీలతను పట్టడంలో తెలంగాణ జెరంత వెనుకబడే ఉన్నదని చెప్పుకోవాలి. ఏడాదిన్నర క్రితం ఎన్నికల ప్రచార సభల్లో నాటి సీఎం కేసీఆర్ విడమర్చి చెప్తే అర్థం కాక దాన్ని ఓట్ల ప్రచారం కింద కొట్టేసినం గానీ దానర్థం, తాత్పర్యం ఇప్పుడర్థమైతాంది.**

**కాం**గ్రెస్ పాలనచూసి, అది తమను గోసపెడుతున్న తీరును చూసి బీఆర్ఎస్‌ను ఓడించి తప్పు చేశామని ప్రజలు వాపోతున్నారు. కాంగ్రెస్ కోణం నుంచి చూస్తే ఇది మొదటి పొరపాటు. అంతేకాదు, బీఆర్ఎస్ అనే జాతీయ పార్టీని గెలిపించుకోకపోవడం మరో పొరపాటు. బీజేపీ కోణం నుంచి చూస్తే ఇది రెండో పొరపాటు. డబుల్ ఇంజిన్ అని, జమిలి ఎన్నికలు అని, పార్లమెంటు నియోజకవర్గాల డీలిమిటేషన్ అని ఊదరగొడుతున్న బీజేపీ మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో గెలవడాన్ని, దాని పర్యవసానాలను తెలంగాణ సమాజం లోతుగా, సూక్ష్మంగా పరిశీలించాయి. అప్పుడే మనం చేసిన రెండో పొరపాటు అర్థమైతది. అలా పరిశీలించినప్పుడే టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా పరిణామం చెందడం, తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తం చేయడం అనే కేసీఆర్ విస్తృత దీర్ఘకాలిక రాజకీయ కార్యాచరణలోని అంతస్సారం బోధపడుతుంది.

బీజేపీ ఆధిపత్యం నుంచి దేశ ప్రజలకు విముక్తి కల్పించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దీర్ఘకాలిక లక్ష్యాన్ని ఎంచుకొని, ప్రత్యామ్నాయ రాజకీయాలను అందించేందుకు ముందడుగు వేశారనేది సుస్పష్టం. అందులో భాగంగానే ఫెడరల్ స్ఫూర్తి ఫరిడవిల్లేలా ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేసేందుకు కృషి చేశారనీ, జాతీయ పార్టీలుగా చలామణి అవుతూ రాష్ట్రాల మీద పెత్తనం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం అందించేందుకు బీఆర్ఎస్ పేరుతో ప్రజల్లోకి వెళ్లారనే సంగతిని అర్థం చేసుకోవచ్చు. పన్నుల రూపంలో పైసలు గుంజుకుంటూ, జనాభా రూపంలో పార్లమెంటు స్థానాలను గుంజుకుంటున్న బీజేపీ తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలను తమ సామంత రాష్ట్రాలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నది. స్వయం పాలనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని, పదేండ్లలో ప్రగతి ప్రస్థానంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన బీఆర్ఎస్ ఓడిపోతే దేశానికి జరిగే నష్టం పైన చెప్పుకున్నదే. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో బీజేపీ ఆధిపత్యానికి తెలంగాణలో కేసీఆర్ అనే



దుర్భేద్యమైన అడ్డు తొలగిపోయింది. ఈలోపు ఢిల్లీలో బీజేపీ గెలుపు మరో హెచ్చరిక.

> **దేశానికి ఉత్తర, దక్షిణ రాజకీయ కేంద్రాలైన ఢిల్లీ, తెలంగాణ మీద పట్టు సాధించడం బీజేపీ ఎత్తుగడల్లోని అసలు వ్యూహం. ఢిల్లీని కైవసం చేసుకోవడం ద్వారా తన మొదటి వ్యూహాన్ని అమలు చేశారు. ఇప్పుడు తెలంగాణను తన ఆధీనంలోకి తెచ్చుకోవడం మిగిలి ఉన్నది. ఈ విషయంలో కాంగ్రెస్‌కు పోయిందేం లేదు. బీజేపీ వచ్చేవరకు అధికారంలో ఉంటే సరిపోతుందన్నది దాని ఆలోచన. పరోక్షంగా చెప్పాలంటే బీజేపీకి కాంగ్రెస్ తోడు పెండ్లికొడుకు అన్నమాట.**

కాబట్టి ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ సమాజం ఇకనైనా సిద్ధం కావాలి. అటు జాతీయ, ఇటు రాష్ట్ర స్థాయిలో తమ నాయకత్వంపై ఏ మాత్రం సోయి లేక సతమతమవుతూ ఆటలో నుంచి ఎప్పుడో తప్పుకొన్న కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీకి ఎన్నడూ ప్రమాదం లేదు. దాని సమస్య అంతా ప్రాంతీయ పార్టీలే. ముఖ్యంగా కేసీఆర్ వంటి జాతీయ దృక్పథం కలిగిన నాయకుడే మోదీ-షా ద్వయానికి పెద్ద సమస్య.

దక్షిణ భారతదేశం మీద దండయాత్రకు 'గేట్ వే ఆఫ్ సౌత్ ఇండియా'గా తెలంగాణను భావిస్తున్నది బీజేపీ అగ్రనాయకత్వం. ఢిల్లీ గెలుపుతో దేశం మీద దండయాత్రకు మార్గం మరింత సుగమమైంది. ప్రాంతీయ పార్టీలపై ప్రజలకున్న విశ్వాసాన్ని పెకిలించి వేయడం ద్వారా తమ ఆధిపత్యానికి ఉన్న అడ్డును తొలగించుకోవాలని యోచిస్తున్నది. ఆ వ్యూహాలకు ఆయా రాష్ట్ర ప్రజలు కూడా తలొగ్గుతున్నారని అర్థమవుతున్నది. ఢిల్లీ ఉదంతాన్ని అలానే అర్థం చేసుకోవాలి.

> **దేశంలో ప్రాంతీయ రాజకీయ నాయకత్వాలను పడగొట్టడం, తద్వారా తమ ఆధిపత్యానికి దారులు వేసుకోవడం అనే ఎత్తుగడలో మోదీ, అమిత్ షా ద్వయం విజయం సాధించింది. సరిగ్గా ఈ ప్రమాదాన్ని నివారించడం కోసమే టీఆర్ఎస్‌ను కేసీఆర్ బీఆర్ఎస్‌గా మార్చి ప్రాంతీయ పార్టీల సమన్వయంతో ఐకమత్యంగా ముందుకు సాగాలని భావించారు. అయితే, ఈ ప్రత్యామ్నాయ దేశీయ రాజకీయ ఉద్యమాన్ని మనం అర్థం చేసుకోలేకపోయాం. మన సమస్యలు మన చుట్టూ మాత్రమే ఉండవని, రాష్ట్రాల సమస్యలకు పరిష్కారం దేశ రాజకీయాలతో ముడిపడి ఉన్నాయనే కేసీఆర్ దార్శనికతను మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సమాజం అర్థం చేసుకోలేకపోయింది.**

బరువులను ఎత్తేందుకు సునాయాసమైన ఉపాయాలను ఫిజిక్స్ మనకు అందిస్తున్నది. అట్లనేదేశంలో రోజురోజుకు పెరుగుతున్న బీజేపీ అనే బరువును ఉపాయంతో దించుకోవడానికి కేసీఆర్ వేసిన దీర్ఘకాలిక వ్యూహం మనకు అర్థం కాలేదు. దూపైనప్పుడే బాయిని తవ్వుకునే అలవాటున్న మనకు ఇకనైనా జాతీయ రాజకీయాల మీద సోయి రావాలి. నెత్తిమీద పడేదాకా నిర్లక్ష్యం చేసే రాజకీయ అవగాహన లోపాన్ని ఇప్పటికైనా సవరించుకోకపోతే భవిష్యత్తు తెలంగాణ తరాలు బాధపడటం ఖాయం.

త్యాగాలతో సాధించుకున్న, పదేండ్లు కష్టపడి నిలబెట్టుకున్న తెలంగాణ రాష్ట్ర పరిస్థితి ఇప్పుడు కాంగ్రెస్ పెనం మీద మాడుతాంది. ఇగ బీజేపీ పొయ్యిలో పడితే మాడి మసైపోతుంది. ఇప్పటికే తెలంగాణ సంపద పన్నుల పేరుతో కేంద్రానికి, మూటల రూపంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి ఎక్కడికక్కడ చేరిపోతున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌ను సాపసుట్టి సంకలో మడుసుకొని బీజేపీ తెలంగాణ మీద చేసే దండయాత్రను ఎదుర్కోవడానికి తెలంగాణ సమాజం సిద్ధంగా ఉండాలి. బీజేపీ అనే దయ్యాన్ని జుట్టుపట్టి నేలకు కొట్టే దమ్మున్న మొనగాడు కేసీఆర్ దిక్కు మల్లా మనం సూడకపోతే మరో వందేండ్లు ఎనకకు పోవడం ఖాయం. తెలంగాణ సమాజమా తస్మాత్ జాగ్రత్త!

# కేంద్రం అమ్మకాలకు రాష్ట్రం వత్తాసు



**డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్**

**కేవలం పదిహేను నెలల్లో అంతా తలకిందులైపోయింది. ఆదాయం అదాటున అట్టడుగుకు అంటే డెడ్ స్టోరేజీ లెవల్‌కు ఎలా పడిపోయింది? జీఎస్టీ వసూళ్లలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం కేవలం ఒకే ఒక శాతం వృద్ధి రేటుతో అధమస్థాయికి ఎలా పడిపోయింది? ముప్పొద్దులా ఢిల్లీ పర్యటనలు సాగుతూనే ఉంటాయి కానీ, మూడు పావలాలు కూడా రాష్ట్రానికి రావు. పథకాలు, వాటికి సంబంధించిన ప్రకటనలు పత్రికల్లో బోలెడు వస్తుంటాయి. కానీ, బొచ్చెడు నిధులు కూడా సమకూరవు. ఏం చెయ్యాలయ్యా అంటే.. సింపుల్ రూట్ ఏమిటంటే అమ్మకాలు.. శిష్యుడు భూములమ్ముకుంటాడు. తన గురువుకు గురువేమో ఉన్న ప్రభుత్వ సంస్థలను తుక్కు కింద చిల్లరకు అమ్మేస్తాడు. ఈ అమ్మకాలకు నాంది పలికింది ఆ గురువే కాబట్టి.. ఈ శిష్యుడు, ఆ గురువుకు ప్రస్తుత మిత్రుడు కూడా ఆయన బాటలోనే నడుస్తున్నారు.**

**తె**లంగాణ వచ్చిన తర్వాత నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సిర్పూర్‌లో కాగజ్‌నగర్ మిల్లును పునరుద్ధరించడంతో పాటు, మరికొన్ని ప్రభుత్వరంగ సంస్థల పునరుజ్జీవం కోసం ప్రయత్నించి సాధించింది. అనేక అంశాల్లోనూ ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ వాటిని కాపాడుకుంటూ వచ్చింది. విద్యుత్తు రంగంలో ప్రభుత్వ సంస్థల చేతనే ఉత్పాదన సాగేలా, ప్రైవేట్ డిస్కంల పాత్రను నామమాత్రమయ్యేలా చూసింది. దామరచర్ల థర్మల్ పవర్‌స్టేషన్‌కు సంబంధించి టెండర్లను నవరత్నాల్లో ఒకటైన బీహెచ్ ఈఎల్‌కు అప్పజెప్పింది. దీనంతటికీ కారణం ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటే.. ప్రజలకు నాణ్యమైన సేవలు లభిస్తాయి. అంతకుమించి అవినీతికి ఆస్కారం అనేదే ఉండదు. కానీ, రెండు జాతీయ పార్టీలకు ఆ సోయి ఏ మాత్రం లేదని మళ్లీ మళ్లీ రుజువవుతూనే ఉన్నది.

కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నా సరే.. మొండిగా ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను తెగనమ్మేస్తున్నది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి కల్పించే ఈ సంస్థను తిరిగి ప్రారంభించాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి వందలకొద్దీ వినతిపత్రాలు ఇచ్చింది. కేవలం అంటే కేవలం బీఆర్ఎస్‌పైనా, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై వ్యక్తిగత కక్షతో ఈ వినతులన్నింటినీ కేంద్ర ఆర్థిక, పరిశ్రమల శాఖల మంత్రులు బుట్టదాఖలు చేశారు. దీన్నిలాగే ఉంచితే తెరవాలన్న డిమాండ్స్ మళ్లీ మళ్లీ వస్తాయన్న భయంతో.. మూడేండ్ల కిందటి నుంచే ఈ పరిశ్రమలోని యంత్ర సామగ్రినంతా తుక్కు కింద అమ్మేయాలని కేంద్రం సన్నాహాలు మొదలుపెట్టింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత అధికార పార్టీ అనుబంధ కార్మిక సంఘాలతో సహా అఖిల పక్షాలూ కేంద్రం ప్రయత్నాలను అడ్డుకున్నాయి. అప్పటి కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ ఆదిలాబాద్ వచ్చి సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని ఓ హామీ ఇచ్చి వెళ్లారు. కానీ, ఇప్పుడు సీన్ మారిపోయింది. కాంగ్రెస్ ముసుగేసుకున్న తమ మిత్రుడి శిష్యుడు అధికారంలోకి రావడంతో కేంద్రం పని చాలా




సులువైపోయింది. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా తన అధిష్ఠానాన్ని కలవడం కంటే కూడా ప్రధాని, ఆయన అంతేవాసులతో జరిపే రహస్య మంతనాలే ఎక్కువ అని ఆయన పార్టీ వాళ్లే చెప్పుకొంటుంటారు. కాకపోతే.. కాంగ్రెస్ పార్టీకి వేరే ప్రత్యామ్నాయం లేదు కాబట్టి ఏమీ చేయలేకుండా ఉన్నారు. తాము ఎలా అంటే అలా సాగే పరిస్థితి ఉండటంతో కేంద్ర ప్రభుత్వం సీసీఐపై మళ్లీ పంజా విసురుతున్నది. సీసీఐలో యంత్రసామగ్రికి రూ.43 కోట్ల విలువ ఉంటుందని తేల్చేసి అంగట్లోకి తెచ్చిపడేశారు. సిమెంట్‌కు డిమాండ్ ఉన్నప్పటికీ, పునః ప్రారంభించడానికి అన్నిరకాల అవకాశాలున్నప్పటికీ ఇవేవీ కూడా కేంద్రానికి పట్టడం లేదు.

> **ఏపీలోని విశాఖ ఉక్కు కర్మాగారాన్ని.. అక్కడ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానంత వరకు అదానీకి అమ్మాలని ప్రయత్నించిన కేంద్ర సర్కారు.. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ ఆలోచన మారిపోయింది. విశాఖ ఉక్కు కర్మాగారానికి రివైవ్ ప్యాకేజీ ప్రకటించేసింది. అంటే, కేంద్రం రాజకీయ కోణంలో మాత్రమే పరిపాలన చేస్తున్నది తప్ప, ప్రజా ప్రయోజనాలు ఏమిటి? కార్మికుల ప్రయోజనాలు ఏమిటి? ఏది సముచితం, ఏది అసంబద్ధం అన్న విశాల దృష్టికోణం పూర్తిగా కొరవడింది.**

అధికారం మనదైతే ఒకలాగా, లేకపోతే మరొకలాగా వ్యవహరించడం ఏ విధంగా సమర్థనీయమో అర్థం కాదు. ఆదిలాబాద్ సీసీఐ కూడా రివైవల్ ప్యాకేజీకి పూర్తిగా అర్హమైనదే. కానీ, కేంద్రం ఆ దృష్టితో ఆలోచించడం లేదు. తెలంగాణ విషయంలో మోదీ ప్రభుత్వం మొదటి నుంచీ నిరాకరణే చేస్తున్నది.

రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మొదటి ఐదేండ్లలో బీఆర్ఎస్‌తో సఖ్యతగా ఉన్న మోదీ ప్రభుత్వం ఆ ఐదేండ్లలోనూ రాష్ట్రానికి చేసిందేమీ లేదు. ఇందుకు కారణం కూడా పొరుగు రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండటం, ఆయన కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటమే. ఈ కారణంగానే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మోదీ సర్కారును గట్టిగా నిలదీసింది. నామమాత్రంగా పసుపుబోర్డు, టెక్స్‌టైల్ పార్క్, రక్షణ భూములు, కోచ్ ఫ్యాక్టరీ, మామునూరు విమానాశ్రయం వంటి వాటికి సంబంధించి ఉత్తర్వులైతే ఇచ్చింది. వాటికి రూపాయి కూడా విదిల్చింది లేదు. ఇవ్వాల్సింది, ఇవ్వకపోగా కొద్ది ఖర్చుతో పునరుజ్జీవం పొందేలా చేయాల్సిన సంస్థలను కూడా అమ్మేసి ప్రజల పొట్ట కొడుతున్నది.

**(వ్యాసకర్త: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్)**




## లాలూ ఎదిగింది నా వల్లే



**లాలూ ప్రసాద్ యాదవ్ నా వల్లే రాజకీయాల్లో ఎదిగారు. గతంలో బీహార్‌లో పరిస్థితి దారుణంగా ఉండేది. సాయంత్రమైందంటే ఎవరూ బయటకు వచ్చేవారు కాదు. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. లాలూ ప్రసాద్ ఈ స్థాయిలో ఉన్నారంటే అది నావల్లే. లాలూకు ఎందుకు మద్దతిస్తున్నారని ఆయన సొంత కులం వారే అడిగినా పట్టించుకోకుండా మద్దతునిచ్చా.**

**- నితీశ్‌కుమార్**
**బీహార్ ముఖ్యమంత్రి**



# డబ్బుకు గురువులు దాసోహమా?

> **'చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్టు' అన్న చందంగా కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. డబ్బుంటే ఉపాధ్యాయ సంఘాలను తమ గుప్పెట్లో పెట్టుకోవచ్చని 'ఓటుకు నోటు' సిద్ధాంతాన్ని నమ్మిన వారి ఆశలు నిజమయ్యాయి. నామినేషన్‌కు మూడు రోజుల ముందు బరిలో దిగినా బడా వ్యాపారవేత్తలు, కార్పొరేట్ వ్యక్తులు మాత్రమే గెలవగలరని హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత రెండోసారి కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికలు నిరూపించాయి.**

**ఓ**టరు నమోదు ప్రక్రియ మొదలు నిరంతరం ఓటర్లతోనే ఉన్న ఉపాధ్యాయ సంఘాల వ్యక్తుల ఆశలు అడియాసలయ్యాయి. విద్యా వ్యవస్థ గురించి తెలియదు, ఉపాధ్యాయుల సమస్యలు తెలియవు, విధివిధానాలు తెలియవు, కనీసం హోదా, ఏ పేరుతో పిలుస్తారో తెలియదు, ప్రభుత్వ బడుల బలోపేతానికి ఏ చర్యలు అవసరమో తెలియదు. బడుగు బలహీన వర్గాల ప్రజల పిల్లలు విద్యా వ్యాపారం అనే ఊబిలో చిక్కుకోకుండా ఎలా కాపాడాలో తెలియదు. మన సెలవులు, మన స్కేళ్లు, మన బెనిఫిట్స్, మన పెన్షన్స్, మన సర్వీసు రూల్స్ ఏమీ తెలియవు. మన విద్యా వ్యవస్థ ఎన్ని మేనేజ్‌మెంట్లలో ఉన్నదో తెలియదు. అయినా, ఇవన్నీ తెలియాల్సిన అవసరం మాకేంటి? అన్నట్టు, 'మా నోట్ల కట్టలతో ఓట్లు వేయించుకునే దమ్ముంది' అనే ధైర్యంతో బరిలోకి దిగారు. నోట్లతో పదవి సాధించే సత్తా ఉన్నదనే నమ్మకంతో ఆట మొదలు పెట్టారు. కార్పొరేట్ ఆలోచనలను మేధావులైన అధ్యాపక, ఉపాధ్యాయ వర్గాలు నిజమని ఈ ఎన్నిక ద్వారా రుజువు చేశారు. ఉద్యోగంలో చేరింది మొదలు ఏదో ఒక ఉపాధ్యాయ సంఘంలో సభ్యత్వాన్ని పొంది, సమస్యలపై పోరాడి, దశాబ్దాల కాలం సంఘ బాధ్యతలను చేపట్టి , ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలబడ్డవారు 'నోటుకు ఓటు' అనే అస్త్రం ముందు విలవిలలాడిపోయారు.

> **గత 25 ఏండ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేసి పెద్ద సంఘంలో బాధ్యత నిర్వర్తిస్తూ, స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పేద విద్యార్థులు చదివే పాఠశాలలకు సౌకర్యాల కల్పనలో నేనున్నానంటూ చేయూతనిస్తూ , అనేక ఉపాధ్యాయ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేస్తూ, అతి పెద్ద సంఘ అభ్యర్థి అయి ఉండి, ఉపాధ్యాయ అధ్యాపక వ్యక్తులకు, వ్యక్తిగతంగా కూడా ఆత్మీయులై ఉండి, ఏడాది కాలంగా ప్రతి టీచర్నీ ఆత్మీయంగా కలిసి వారితో మమేకమైన వ్యక్తి వ్యక్తిత్వం, విలువలు, సంఘ బలం.. అన్నీ నోటుకు ఓటు ముందు చిత్తుగా ఓడిపోయాయి.**

సిట్టింగ్ ఎమ్మెల్సీ సేవలను కూడా ఓటుకు నోటు మింగేసింది. భావజాలం, కులవాదం, సంఘం అన్నింటినీ కాదని డబ్బు ఎవరికీ చేదు కాదని ఈ ఎన్నికలు నిరూపించాయి. డబ్బు జబ్బుకు తామేమీ అతీతులం కాదని నిరూపించారు. ఒక సాధారణ ఓటర్ కంటే దారుణంగా ఆలోచించారు. వెన్నెముక లేని వ్యక్తులుగా సమాజం ముందు నిలబడ్డారు. ఉదయాన్నే పాలవాళ్ల నుంచి, పనివాళ్ల వరకు డబ్బుకు టీచర్లు అమ్ముడుపోయారంటుగా అంటుంటే తలదించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. మీ కంటే ఒక సాధారణ ఓటరే నయం పార్టీకి కట్టుబడి ఉంటారని అంటుంటే తలవంచుకోక తప్పలేదు. విద్యావంతులు, ఉపాధ్యాయ అధ్యాపకుల ఆలోచన ఎంతో దూరదృష్టితో ఉండాలి. ఎంతో చాకచక్యంగా ఉండాలి. వారు తీసుకునే నిర్ణయం ఎంతో చాణక్య నీతిని ప్రదర్శించాలి. కానీ, అది జరగలేదు. కనీసం చదువుకోని సగటు సాధారణ ఓటరు స్థాయి ఆలోచన కూడా చేయలేకపోయారు.

వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి తన ఓటును నోటుకు అమ్ముకోడు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాల్సిన మన మేధావులు నోటుతో ఓటు కొనే వారి చెంప చెళ్లుమనిపించేలా నిర్ణయం తీసుకుని ఉండవలసిందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఒక ఎత్తుగడను ప్రదర్శించి డబ్బుతో ఓటు కొనొచ్చనే అహంకారాన్ని దించే సులభ ఉపాయం కూడా మన చేతుల్లోనే ఉంది. డబ్బు తీసుకొని ఓటు మాత్రం సేవ చేసే వారికి, దశాబ్దాలుగా సంఘ మాధ్యమంగా, ఉపాధ్యాయ సమస్యలపై పాటుపడుతున్న వారికి, మనతోపాటు ఉన్నవారికి వేసి ఉంటే రాబోయే కాలంలో నోటు ఎరవేసి ఓట్లు తన్నుకుపోయే కార్పొరేట్ గద్దలకు గుణపాఠం అయ్యేది. కానీ ఇక్కడ మన మేధావులు ధర్మబద్ధంగా ఆలోచించారు. డబ్బులు పెద్ద మొత్తంలో ఒకటోసారి, రెండవసారి కూడా తీసుకొని వాళ్ల రుణంలో పడకుండా ఓటు వేశారు. కానీ టీచర్ వ్యవస్థకు సంబంధం లేని వ్యక్తిని మనకు అందించి మన వేలుతో మనమే పొడుచుకునే కళ్లు లేని కబోదుల్లా, వ్యక్తిత్వం లేని అమ్ముడుపోయే వ్యక్తులుగా మిగిలిపోయారు. కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఓటును అమ్ముకొని నోటును గెలిపించిందని అందరూ అభిప్రాయపడుతున్నారు.

టీచర్స్‌తో నిరంతరం ఉండే వారిని పక్కన పెట్టి, కార్పొరేట్ వ్యక్తిని నెత్తిన పెట్టుకున్నారు. మొత్తం 15 మంది పోటీ చేయగా దాదాపు 54 శాతం మంది ఓటర్లు టీచర్లను కాదని పరిచయం లేని వ్యక్తికి ఓటు వేశారు. అంటే డబ్బు ప్రభావం ఎంతగా పనిచేస్తుందో తెలుస్తున్నది. కేజీబీవీ, సొసైటీ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రైవేట్ స్కూల్స్ గంప గుత్తగా ఒకే వైపు వేశారన్న గుసగుస వినబడుతున్నది. సంఘ నాయకులు సైతం డబ్బుకు అమ్ముడుపోయారని విమర్శలు వస్తున్నాయి. పూర్తిగా ఓటుకు నోటు మీద ఆధారపడని నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఎవరి క్యాడర్ ఓట్లు వారికే రావడంతో హోరా హోరీ పోరాటం జరిగింది. బీసీ వాదం, సంఘ బలాలు గట్టిగా పోటీ పడ్డాయి. మొత్తం మీద మేధావులు సాధారణ ఓటరు కంటే దారుణంగా ఆలోచించారని, సమాజంలో ఒక చర్చనీయ అంశంగా మారింది. డబ్బుకు గురువులు దాసోహం కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నది.



**లక్కిరెడ్డి విజయ శుభాకర్ రెడ్డి**
(వ్యాసకర్త: ఉపాధ్యాయురాలు)